సాక్షి
పెద్దపల్లి
గురువారం । 1 । జూన్ । 2023



వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రామగుండం: ఆబాది రామగుండంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర సంప్రోక్షణ వేడుకలు వైభవంగా జరిగాయి.



బొడ్రాయి మహోత్సవం

పాలకుర్తి: పుట్నూర్‌లో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మహిళలు, ఎమ్మెల్యే చందర్ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి అధికమవుతుంది. సాయంత్రం మేఘావృతమై కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పొగాకు క్యాన్సర్ కారకం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: పొగాకు వాడకం ద్వారా క్యాన్సర్ వంటి రోగాలబారిన పడే అవకాశ ముందని, ధూమపానం ఆరోగ్యానికి హానికర మని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో బుధవారం పొగాకు ఉత్పత్తుల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని డీఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను బహిరంగ ప్రదేశాల్లో వినియోగించడం చట్ట విరుద్ధమన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నేరమేనన్నారు. సిగరెట్, గుట్కాలను వాడి ఉమ్మి వేయడం వల్ల కూడా రోగాల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. కంటివెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్‌కుమార్, రాఘవాపూర్ పీహెచ్‌సీ వైద్యురాలు లావణ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో పోటెత్తిన భక్తజనం



స్వామి సన్నిధిలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లన్న ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ముకుందరెడ్డి

జ్యోతినగర్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని భూపోరాట కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఇళ్లు ఇవ్వలేదని, వేలాదిమంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా గురవుతున్నా పాలకులు, అధికారయంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలు గుడిసెలు వేసుకుంటే అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. స్థలాలు కేటాయించని పక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, రవీందర్, శ్రీనివాసరెడ్డి, రమణక్క, దేవేంద్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ కులస్తుల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రమణ

కాల్వశ్రీరాంపూర్: చేనేత కార్మికులు, పద్మశాలీ కులస్తుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాముఖ్యత ఇస్తోందని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో భక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో టెక్స్‌టైల్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, బొడ్డుల లక్ష్మణ్‌తో కలిసి పూజలు చేశారు. మండలకేంద్రంలో పద్మశాలీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రమణ తన నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించిన రమణను పలువురు అభినందించారు. పద్మశాలీ కులస్తులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని రమణ పేర్కొన్నారు. సర్పంచు ఆడెపు శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రా రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సబ్బని రాజమల్లు, గోలి రంగయ్య, శ్రీకాంత్, రమణ, రమేశ్, హరికృష్ణ వొడ్నాల శ్రీనివాస్, పద్మశాలీ కులస్తులు పాల్గొన్నారు.





హోమం నిర్వహిస్తున్న అర్చకులు



గోవిందా.. హరి గోవిందా

వేంకటరమణ గోవిందా..

అన్నమాచార్య కీర్తనలు.. ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితుల వేదమంత్రోచ్చరణలు.. వెల్లువిరిసిన భక్తి పారవశ్యం మధ్య బుధవారం సాయంత్రం కరీంనగర్ పద్మనగర్‌లో శ్రీనివాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తంతులో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్ రావు, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, సీపీ సుబ్బా రాయుడు, గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితులు మంత్రోచ్చరణలమధ్య శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ వైభవంగా జరిగింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – కరీంనగర్‌కల్చరల్



ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ బండి సంజయ్



తాళిబొట్టు చూపుతున్న వేదపండితుడు



స్వామివారి ఉత్సవ విగ్రహం



స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్, సునీల్‌రావు

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



అధికారులతో సమావేశమైన చీఫ్‌విప్ భాను ప్రసాదరావు, కలెక్టర్, ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్

పెద్దపల్లిరూరల్: దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సంగీత, జెడ్పీచైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి ఉత్సవాల నిర్వహణపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల వారీగా వేడుకలకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరించారు. దశాబ్ది ఉత్సవాలకు విస్తృతంగా ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీపీఓ ఆదిరెడ్డి తదితర శాఖల అధికారులున్నారు.

వేడుకలు పండుగలా నిర్వహించాలి

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. స్థానిక పద్మనాయక కళ్యాణమండపంలో ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. రాష్ట్రప్రభుత్వం ప్రగతిని ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. తాగు, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ పథకాలపై వివరించాలని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గణపతి, మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్ రావు, వీరగోని సుజాత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు ఫకీర్‌యాదవ్, సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షించారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజకొమురయ్య, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

మార్కెట్ నుంచి దళారులకు ధాన్యం

- నెల రోజులైనా తూకం వేయని వైనం
- కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల దైన్యం
- ప్రైవేట్ వ్యక్తులకు తెగనమ్ముకుంటున్న వైనం



మార్కెట్ నుంచి ధాన్యాన్ని తీసుకెళ్తున్న రైతు ఓదెలు

మంథని: పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అకాలవర్షం వస్తే ఆ ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఇప్పటికే మూడు సార్లు ధాన్యం తడవడంతో విసుగుచెందుతున్న అన్నదాతలు తమ ధాన్యాన్ని దళారులకు తెగనమ్ముకుంటున్నారు. మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన చింతనిప్పుల ఓదెలు తన ఏడెకరాల్లో పండించిన పంటను మంథని మార్కెట్‌లో నెలక్రితం పోశాడు. కాంటా వేయకపోవడం.. వర్షాల ధాటికి తడిసిపోవడంతో దిగులు చెందాడు. బుధవారం మార్కెట్‌లోని ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుకుని ప్రైవేటు కొనుగోలుదారుకు విక్రయించాడు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడకు చెందిన గాజుల కిట్టుదీ ఇలాగే తెగనమ్ముకున్నాడు.

ముంచుకొస్తున్న ముప్పు

- వ్యర్థాలతో నిండిన నాలాలు
- వేసవిలోనే పూర్తిచేయాల్సిన పనులు
- ఇంకా కార్యాచరణ మొదలెట్టని అధికారులు
- దుర్వాసనతో తల్లడిల్లుతున్న కార్పొరేషన్ ప్రజలు



మార్కండేయకాలనీలో మురుగునీటి కాలువ



నగరంలోని మేజర్ నాలా దుస్థితి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌లోని ప్రధాన నాలాలు వ్యర్థాలతో నిండిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మురుగునీరు సాఫీగా వెళ్లడం లేదు. తద్వారా దోమల బెడద తీవ్రరూపం దాల్చింది. నాలాల నుంచి వ్యాపిస్తున్న దుర్వాసనతో స్థానికులు నరకయాతనకు గురవుతున్నారు. వాస్తవంగా ఏప్రిల్‌లోనే నాలాల్లోని పూడికతీతకు సంబంధించి ప్రతిపాదనలు పూర్తి చేసి.. మే నెలలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ జూన్ ప్రారంభమవుతున్నా.. పూడికతీత పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. అధికారులు ప్రతిపాదనలు పంపేదెప్పుడు..? పూడిక తొలగించేదెప్పుడు..? దుర్వాసన దూరమయ్యేదెప్పుడు..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వర్షాకాలం సమీపించడం.. నాలాల్లో పూడికతీత పేరుకుపోవడంతో లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉందని ఆందోళనకు గురవుతున్నారు.

పూడికతీత పనులపై పట్టింపేదీ..?

నగరంలో సుమారు 319.9 కిలోమీటర్ల మేర మురుగు కాల్వలు ఉన్నాయి. వీటిలో ఎనిమిది మేజర్ నాలాలు ఉన్నాయి. మిగితా నాలాలను బల్దియాలోని శానిటేషన్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తూ శుభ్రం చేయించాల్సి ఉంటుంది. ప్రధాన నాలాలను మాత్రం వేసవి ఆరంభంలోనే యాక్షన్ ప్లాన్‌తోపాటు నాలాల పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంటుంది. రెండు నెలల ముందే చేపట్టాల్సిన ప్రక్రియ వర్షాకాలం దగ్గరకొస్తున్నప్పటికీ ముందుకురావడం లేదు.

దుర్వాసన వెదజల్లుతున్న నాలాలు

నగరంలో 2ఏ ఇంక్లయిన్, కూరగాయల మార్కెట్ ఏరియా, ఉల్లిగడ్డల బజార్, విఠల్‌నగర్, మార్కండేయకాలనీ, ఎన్టీపీసీ, ఇందిరానగర్, రమేశ్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, గంగానగర్, 6బీ గుడిసెలు తదితర ప్రాంతాల్లోని ప్రధాన నాలాల్లో పూడిక నిండి దుర్వాసన వ్యాపిస్తోంది. ఏటా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై, మొక్కుబడిగా పూడితీత పనులు చేపడుతున్నారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

సకాలంలో చేపట్టకుండా నిర్లక్ష్యం

ఎండాకాలంలో పూడికతీత పనులు పూర్తి చేయడం ద్వారా వర్షాకాలంలో మురునీరు, వరదనీరు సాఫీగా నాలాల ద్వారా ముందుకు ప్రవహిస్తుంది. సకాలంలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే నగరంలోని ప్రధాన నాలాలు పొంగి పొర్లుతున్నాయి. అప్పటికే పేరుకుపోయిన పూడికతీతతో స్థానిక ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ సకాలంలో యాక్షన్ ప్లాన్ చేపట్టి పనులు నిర్వహిచకుండా ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏప్రిల్‌లో పిలవాల్సిన టెండర్లను మే నెలలో రూ.30 లక్షల వ్యయంతో పిలిచారు. ఈ పనులు కూడా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

దుర్వాసన భరించలేక పోతున్నాం



మార్కండేయ కాలనీలోని ప్రధాన నాలాలో పూడికతీత చేపట్టాలని అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేశాం. నాలాలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, చెత్త, మట్టి పేరుకుపోయి మురుగు నీటి ప్రవాహం నిలిచిపోయింది. దుర్వాసన భరించలేకపోతున్నాం. చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌కు మొరపెట్టుకున్నాం. వర్షాలు రాకముందే అధికారులు స్పందించాలి.

– చెరుకుపల్లి రాజిరెడ్డి, మార్కండేయకాలనీ

త్వరలో పనులు



ప్రధాన నాలాల్లో పూడికతీత పనులను త్వరలో ప్రారంభిస్తాం. 21వ డివిజన్‌లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నాం. ప్రధాన నాలాల్లో పూడికతీతకు రూ.30లక్షల వ్యయంతో టెండర్ పిలిచాం. పనులకు అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది. పనులు నిర్వహించేలా ఇంజినీరింగ్, శాని టేషన్ విభాగం అధికారులను ఆదేశిస్తాం.

– బి.సుమన్‌రావు, కమిషనర్

ప్రభుత్వ ఆసుపత్రులకు కాయకల్ప అవార్డు

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కాయకల్ప అవార్డుకు జిల్లాకేంద్ర ఆసుపత్రి, సుల్తానాబాద్ సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఎంపికైనట్లు ఎన్‌హెచ్‌ఎం క్వాలిటీసెల్ అధికారి అనిల్ తెలిపారు. రెండు నెలల క్రితం ఈ రెండు ఆసుపత్రులను కాయకల్ప కేంద్ర బృందం తనిఖీ చేసిన విషయం తెల్సిందే. నివేదికను కేంద్రప్రభుత్వానికి అందించారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం పెద్దపల్లి డీహెచ్ కోటాలో రూ.3లక్షలు, సీహెచ్‌సీ కోటాలో సుల్తానాబాద్ ఆసుపత్రికి రూ.లక్ష అందనున్నాయి. 2022–23ఆర్థిక సంవత్సరానికిగాను ఈ అవార్డును ప్రకటించినట్లు అనిల్ తెలిపారు. నిధుల్లో 25శాతం సిబ్బందికి ప్రోత్సాహక నగదు, 75శాతం నిధులు ఆసుపత్రుల డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా వాడుకునే అవకాశం కల్పించింది. ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగడం.. శుభ్రత, పరిశుభ్రత, బయోవెస్టేజ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండడంతో అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

నాణ్యతాప్రమాణాలతో సేవలందాలి

పెద్దపల్లిరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై కేంద్రబృందం సభ్యులు ఆరాతీశారు. స్వచ్ఛత, పరిశుభ్రతకు ఏ మేరకు ప్రాధాన్యతనిస్తున్నారు..? బయోవేస్టేజ్ నిర్వహణ ఎలా చేస్తున్నారు..? అనే అంశాలు తెలుసుకున్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల కార్యక్రమం కింద పెద్దపల్లి మండలం రాగినేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృంద సభ్యులు పులాక్‌పాల్, సోమనాథ్ ఛటోపాధ్యాయ్ పరిశీలించారు. తనిఖీ బృందాలు అందించే నివేదికల ఆధారంగా ఎంపికైతే మూడేళ్ల పాటు ఆసుపత్రి నిర్వహణ, అభివృద్ధికి ఏటా రూ.2లక్షల ప్రత్యేక నిధులు అందనున్నాయి. వైద్యాధికారి శ్రావణ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్జీ-3 జీఎంగా అదనపు బాధ్యతలు


ఆర్జీ-2 జీఎం మనోహర్

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3 జీఎంగా ఆర్జీ-2 జీఎం మనోహర్ బుధవారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఆర్జీ-3 జీఎంగా పని చేసిన టి.వెంకటేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ పొందగా సీఎండీ శ్రీధర్ ఆర్జీ-2 జీఎంకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పెద్దంపేటలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు


రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై బుధవారం గ్రామానికి చెందిన పలువురు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. గత మే 27న కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో జీపీ రికార్డులు తనిఖీ చేయగా నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ జరిగిందన్నారు. పంచాయతీరాజ్ చట్టం-2018 అనుసరించి కాకుండా ఇష్టారాజ్యంగా పాలన చేస్తుండటమే దీనికి కారణమని ఆరోపించారు. వెంటనే విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పైడిపల్లి వెంకటస్వామి, మేర్గు నరేష్, పైడి భూమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాకేశ్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): నాంసానిపల్లె గ్రామానికి చెందిన నూనె రాకేశ్(22) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాకేశ్ బుధవారం నారు మడికి నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాకేశ్ నేత్రాలను అతని కుటుంబసభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు.

రైస్‌మిల్లు ఆపరేటర్..


తల్యాబ్ అలీ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాల శివారు రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్న తల్యాబ్ అలీ(21) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. కోల్‌కతాలోని కొల్వా గ్రామానికి చెందిన తల్యాబ్ అలీ గత కొంత కాలంగా కామధేనువు రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉతికిన దుస్తులను తన రూంలో ఆరవేస్తుండగా తీగకు విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది నదీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనకు రైస్‌మిల్లు యాజమాన్యమే కారణమని కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఆటల పోటీలు




రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-2 ఏరియా సీఇఆర్ క్లబ్ ఆవరణలో సింగరేణి ఉద్యోగులు, మహిళలు, చిన్నారులకు నిర్వహించిన ఆటలపోటీలకు ఆర్జీ-2 ఏరియా సేవా అధ్యక్షురాలు సవితామనోహర్ ప్రారంభించారు. మ్యూజికల్ చైర్స్, బాంబేఇన్‌సిటీ, బాల్‌త్రో, బాల్ ఇన్‌దబాస్కెట్ నిర్వహించారు. విజేతలకు జూన్ 2న బహుమతులు ప్రదానం ఉంటుందని డీజీఎం పర్సనల్ అధికారప్రతినిధి రాజేంద్రప్రసాద్ తెలిపారు. – యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం)

'నూతన సాంకేతికత అవసరం'


శిక్షణ మాన్యువల్‌ను ఆవిష్కరిస్తున్న ఈడీ సునీల్‌కుమార్, అధికారులు

జ్యోతినగర్(రామగుండం): కార్మికుల్లో నూతన సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి మెరుగైన, రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఈడీ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో కాంట్రాక్టు కార్మికులకు నైపుణ్యాభివృద్ధిపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పని ప్రదేశాల్లో సురక్షితమైన పనిని నిర్ధారించడానికి కావాల్సిన నైపుణ్యాలను అందించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. భద్రత, రక్షణపై రాజీ పడేది లేదని, ప్రతి ఒక్కరూ రక్షణసూత్రాలు పాటిస్తూ.. విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ప్రసేంజిత్ పాల్, అనిల్‌కుమార్ వేముల, మోహన్ రెడ్డి, ఠాకూర్, రవీంద్ర పటేల్, హరే రామ్ సింగ్, తపస్ సాహా తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ విషయంలో వివాదం

- బసంత్‌నగర్‌లో ఇరువర్గాల మధ్య ఆరు గంటలపాటు హైడ్రామా
- తహసీల్దార్ జోక్యంతో సద్దుమణిగిన వైనం


భూమి పత్రాలను ఏఈఓకి చూపిస్తున్న లింగమూర్తి

పాలకుర్తి(రామగుండం): మండలంలోని బసంత్‌నగర్‌లో నిర్మించతలపెట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ విషయమై బుధవారం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దాదాపు ఆరు గంటల హైడ్రామా అనంతరం తహసీల్దార్ సునీత జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. బసంత్‌నగర్‌లో సర్వే నంబర్ 359, 350లలో గల భూమి విషయంలో గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, గ్రామానికి చెందిన పాత లింగమూర్తి కుటుంబానికి మధ్య వివాదం ఉంది. ఈ క్రమంలో పంచాయతీ భవన నిర్మాణం కోసం సర్పంచ్ కట్టికోల వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ఉదయం భూమిపూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తుల సమక్షంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ ముగ్గు పోసే పనులు ప్రారంభించగా లింగమూర్తి, అతని కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. దీంతో వారికి, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. సర్వే నంబర్ 359లో ఉన్నది ప్రభుత్వ స్థలమని అధికారులు ధ్రువీకరించిన తర్వాతే తాము భూమిపూజ చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కానీ సదరు స్థలం సర్వే నంబర్ 350 లోనిదని, ఇది తన అన్న పాత బాపుశెట్టిదని లింగమూర్తి వాదించాడు. దీంతో స్థానికంగా కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఇరువర్గాలను సముదాయించారు. భూమికి సంబంధించిన విషయం అయినందున రెవెన్యూ అధికారులను ఆశ్రయించి, సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం స్థానికుల అభ్యర్థన మేరకు అక్కడికి వచ్చిన తహసీల్దార్ సునీత రెండు రోజుల్లో సర్వే చేసి, సంబంధిత భూమి సర్వే నంబర్ 350లో ఉందా లేక 359లో ఉందా అన్నది తేలుస్తామని చెప్పారు. దీంతో అందరూ శాంతించారు.

బైక్ కాలువలో పడి యువకుడికి గాయాలు

- డిగ్రీ పరీక్ష రాసేందుకు వెళ్తుండగా పెద్దపల్లిలో ఘటన


గాయపడిన అరవింద్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం పరీక్ష రాసేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి, గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన రేచవేని అరవింద్ డిగ్రీ సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు బైక్‌పై బయల్దేరాడు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి అతిసమీపంలో ఊక లోడ్‌తో వస్తున్న లారీని తప్పించబోయాడు. ఆ సమయంలో ఊక కళ్లలో పడింది. దాంతో బైక్ అదుపుతప్పి, కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అరవింద్‌కు గాయాలవగా స్థానికులు బయటకు తీసి, అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు. సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేందర్ తెలిపారు.

కొన్ని నెలల్లో కొలువు.. కబళించిన మృత్యువు

- విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం
- హార్వెస్టర్‌కు సర్వీసింగ్ చేస్తుండగా ఘటన
- పక్షవాతంతో మంచాన తండ్రి
- మెడికల్ అన్‌ఫిట్‌తో కుమారుడికి సింగరేణి ఉద్యోగం
- అంతలోనే అనంతలోకాలకు వెళ్లడంతో కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీశ్, ఎస్సై వెంకటేశ్వర్లు


కుమారస్వామి (ఫైల్)

మంథని: పేరుకు సింగరేణి ఉద్యోగం.. కానీ అనారోగ్య సమస్యలు ఆ కుటుంబ పెద్దను వెంటాడాయి.. పక్షవాతం రావడంతో దయనీయ స్థితిలో కాలం గడుపుతున్నారు.. అది చాలదన్నట్లు ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది.. ఒక్కగానొక్క కుమారుడిని విద్యుదాఘాతం రూపంలో తీసుకెళ్లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మంథని మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన శనిగరపు లక్ష్మి-జనార్దన్ దంపతులకు ఏకైక సంతానం కుమారస్వామి(18). జనార్దన్ సింగరేణిలో ఉద్యోగం చేస్తూ పక్షవాతానికి గురయ్యాడు. కుమారుడికి తన ఉద్యోగం ఇప్పించేందుకు సిద్ధమయ్యాడు. మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియ కూడా పూర్తయింది. కొన్ని నెలల్లోనే కుమారస్వామి ఉద్యోగంలో చేరేవాడు. కానీ కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో అప్పటివరకు తల్లిదండ్రుకు ఆసరాగా ఉండాలని భావించి, స్థానికంగా ఫోమ్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిలో చేరాడు. బుధవారం ఓ కస్టమర్‌కు చెందిన హార్వెస్టర్‌ను శుభ్రం చేస్తుండగా వాటర్ పైపు ద్వారా విద్యుత్ సరఫరా జరిగి, విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఇక తమకు దిక్కెవరంటూ కుమారస్వామి తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. సంఘటన స్థలాన్ని మంథని సీఐ సతీశ్ పరిశీలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని ప్రభుత్వం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న


మాట్లాడుతున్న రాజన్న

గోదావరిఖని(రామగుండం): పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న ఆరోపించారు. బుధవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ఆర్భాటం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును సొంత ప్రయోజనాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, ఉత్సవాలు జరపడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ, నరేష్, ఎ.వెంకన్న, బి.అశోక్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లికి చెందిన ఎలవేణి రాజయ్య(55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజయ్య గతంలో అప్పు చేసి, మస్కట్‌కు వెళ్లి వచ్చాడు. కాగా అప్పు తీరకపోవడం, పెళ్లికి ఎదిగిన కూతురు ఉండటంతో దంపతులు సోమవారం గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రాజయ్య బుధవారం క్రిమిసంహారక మందు తాగి, పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. గమనించిన పోలీసులు వెంటనే అతన్ని తమ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి బలవన్మరణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలంలోని సుందిళ్ల గ్రామానికి చెందిన జనగామ నర్సయ్య కూతురు ప్రత్యూష(33) ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్యకు నలుగురు ఆడపిల్లలు కాగా రెండో కుమార్తె ప్రత్యూషకు పుట్టుకతోనే మాటలు సరిగా రావు. ఆమె మానసిక పరిస్థితి బాగా లేకపోవడం, నరాల బలహీనతతో బాధ పడుతుండేది. వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఏడాది క్రితం థైరాయిడ్ ఉందని డాక్టర్లు చెప్పడంతో మరింత బాధ పడుతూ గదిలో నుంచి బయటకు రావడం లేదు. బుధవారం తల్లిదండ్రులు మందులు వేసుకోమని చెప్పి, కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రత్యూష ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

కేటాయించిన ధాన్యం దిగుమతి చేసుకోవాల్సిందే..


గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్(పెద్దపల్లి): రైస్ మిల్లర్లకు అలాట్ చేసిన ధాన్యాన్ని తప్పనిసరిగా దించుకోవాలని కలెక్టర్ ఎస్.సంగీత అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలం పూసాల సమీపంలోని రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోహన్‌కృష్ణా, భవానీశంకర్, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, హరి శంకర్, భవాని ఎంఆర్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ధాన్యం సకాలంలో దించుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థలం కొరత ఉంటే తాత్కాలికంగా ఇంటర్మీడియట్ గోడౌన్లలో స్థలం కల్పిస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తోట వెంకటేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

దశాబ్ది వేడుకలు వైభవంగా నిర్వహించాలి

- ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం గోదావరిఖనిలోని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంను సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి, వేడుకలకు హాజరయ్యే కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ నెల 5న ఉదయం స్టేడియంలో ఫుడ్ కోర్ట్ స్టాల్స్, ప్రముఖ కళాకారులచే ధూంధాం, కనులవిందు చేసే తెలంగాణ కల్చరల్ షో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మీనారాయణ, సివిల్ డీజీఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై బుధవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా రక్షణ అధికారి బచ్చ రవీందర్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించండి

- ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వర్‌రావు


ఓసీపీ-2లో కోల్ సైబర్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో భాగంగా గనుల్లో ఏర్పాటు చేస్తున్న యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2 క్వారీలో నూతనంగా ఏర్పాటు చేసిన కోల్ సైబర్ మెషీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణిలో మొట్టమొదటిసారిగా కోల్ సైబర్ మెషీన్‌ను ఓసీపీ-2లో ప్రారంభించుకోవడం జరిగిందని, ఇది పెద్ద పెద్ద బొగ్గు పెల్లలను చిన్నగా కట్ చేస్తుందని తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు, వాహనాలను చిన్న చిన్న మరమ్మతుల పేరిట పక్కన పడేయవద్దన్నారు. పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించుకోగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఎలిషా, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏరియా సర్వే అధికారి జైనుల్లాబద్దీన్, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, మేనేజర్ రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్, నాయకులు పర్శ బక్కయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు బుద్ధి చెప్పాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): హామీలు అమలు చేయని టీబీజీకేఎస్‌కు రాబోయే గుర్తింపు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం జీడీకే-5 ఓసీపీపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు అనేక హామీలిచ్చి, అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కొత్త బొగ్గు గనులు ప్రారంభిస్తామని, 10 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, నూతన క్వార్టర్లు నిర్మిస్తామని చెప్పి, మోసం చేశారన్నారు. హామీలు అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలు పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. నాయకులు వికాస్‌కుమార్, ఎట్టెం కృష్ణ, సమ్మయ్య, సాగర్, జగన్మోహన్, శ్రీనివాస్, ఆంజనేయులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీడీకే-2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల హక్కుల రక్షణలో తమ యూనియన్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్మిక సంఘాల ఐక్యతతోనే మెరుగైన 11వ వేతన ఒప్పందం సాధించామని పేర్కొన్నారు. సింగరేణిలో నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. లేకపోతే కార్మికులే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, కారం సత్తయ్య, వంగల రాములు, పి.శ్రీనివాసరావు, నంది నారాయణ, బొంకూరు సురేష్, పులి ఈశ్వర్, ఆర్.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమాలకు పిలవాలి


మాట్లాడుతున్న జాతీయ సంఘాల నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి యాజమాన్యం నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు అన్ని సంఘాలను పిలవాలని జాతీయ సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, తుమ్మల రాజారెడ్డి, యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గెలిచిన సంఘాన్ని మాత్రమే పిలిస్తే తాము ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై జాతీయ సంఘాలు తీర్మానం చేసి, లేఖను డైరెక్టర్(పా)కు పంపించినట్లు తెలిపారు. అయితే దశాబ్ది ఉత్సవాలకు అన్ని సంఘాలను అధికారికంగా పిలుస్తామని తెలపడంతో నిరసన కార్యక్రమం వాయిదా వేశామన్నారు. అన్ని యూనియన్ల నాయకులు, కార్యకర్తలు ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

ఉద్యోగ విరమణ రోజే అవయవదానానికి అంగీకారం


అభినందిస్తున్న మేనేజర్ ఉదయ్ హరిజన్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో నివాసం ఉంటూ ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న పార్థసారథి అరుణ్ కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన అవయవదానానికి అంగీకరించడంతో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, ఓసీపీ-1 మేనేజర్ ఉదయ్ హరిజన్, ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్‌ల చేతులమీదుగా అంగీకార పత్రంతోపాటు అభినందన పత్రం అందజేశారు. సమాజహితం కోసం మరణానంతరం నేత్రాలు, శరీరం మట్టిలో కలిసిపోకుండా ఉండేందుకు ముందుకు వచ్చిన అరుణ్‌కుమార్‌ను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఓసీపీ-1 ప్రాజెక్టు ఆఫీసర్ రాధాకృష్ణ, పర్సనల్ ఆఫీసర్ సునీల్ ప్రసాద్, ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేశ్ తదితరులు అభినందించారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి


రాజయ్యను సన్మానిస్తున్న డీఈ మధుమతి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని ఎస్సారెస్పీ ఈఈ ప్రసాద్ అన్నారు. ఎస్సారెస్పీ లష్కర్ పోతర్ల రాజయ్య ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఉద్యోగ సమయంలో రాజయ్య అధికారుల మన్ననలు పొందారని, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతోపాటు కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. డీఈ మధుమతి, ఏఈలు ప్రవీణ్ రాజా, జమీల్, సంఘం నాయకులు దామోదర్, లచ్చయ్య, చంద్రారెడ్డి, కొండం రాజిరెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కలవల శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు పోచమల్లు, సిబ్బంది పాల్గొన్నారు.